

1 నుంచి డయేరియా నివారణపై అవగాహన

అరసవల్లి, జూన్ 26: డయేరియా నివారణపై జూలై ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల లోపు వయసు గల పిల్లలను నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతీ పిల్లవానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందజేసి, డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారి తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. జిల్లా కార్యాలయంలో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పాలన మారింది.. విధ్వంసం ఆగింది

- వైసీపీ సర్కారులో మితిమీరిన అక్రమాలు
- ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- కొండలనూ మింగేశారు
- ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- ప్రజల ఆస్తులకు కరువైన రక్షణ
- కూటమి ప్రభుత్వం రావడంతో ఊపిరిపీల్చుకుంటున్న వైనం





(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో విధ్వంసం చోటుచేసుకుంది. అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు వంతులువేసుకుని మరీ ప్రభుత్వ సంపదను కొల్లగొట్టారు. ప్రభుత్వ భూములు, గెడ్డలు, వాగులు, చెరువులు, వాగులు ఇలా ప్రతిదీ వదలకుండా ఆక్రమించేశారు. కొండలను పిండి చేసేశారు. నదులే శుష్కించే రీతిలో ఇసుకను తరలించుకుపోయి రూ.కోట్లకు పడగలెత్తారు. మళ్లీ అధికారంలోకి రాలేమన్న రీతిలో అక్రమాలకు పాల్పడ్డారు. అయితే, రాష్ట్రంలో వైసీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో పాలన ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది. ఐదేళ్ల నరకం చవిచూసిన ప్రజలకు వాస్తవాలు అవగతమవుతున్నాయి. తమ ఆస్తులకు రక్షణ కలిగిందని భావిస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిఉంటే ఉన్న కొండలు, ఇసుక కూడా మిగిలే పరిస్థితి ఉండేదికాదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

టెక్కలిలో..

టెక్కలిలోని గ్రానైట్ క్వారీల్లో కొన్నింటికే అనుమతిని చూపి మరికొన్నింటికి ఓ ఎమ్మెల్సీ రౌడీయిజంతో వాటాలు వేసుకుని పాలరాయిని ఇష్టానుసారంగా తరలించుకుపోయారు. అలాగే, ఇక్కడ నిర్మాణంలో ఉన్న పోర్టుకోసం తరలిస్తున్న ఇసుక, రాళ్లు, కంకరు విషయంలో కూడా వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ పెద్దఎత్తున లాభపడ్డారు. అధికభాగం కాంట్రాక్టులు చేస్తూ తనకింద ఉన్న నాయకులను సైతం మోసం చేశారు. అయినా మైనింగ్ అధికారులు దాడులు చేసిన దాఖలాలు గత ఐదేళ్ల కాలంలో లేవు. వైసీపీ పాలనలో జరిగిన క్వారీలో తవ్వకాలు, లీజులు, నదుల నుంచి తరలించిన ఇసుక, ప్రభుత్వ భూముల ఆక్రమణ, రిజిస్ట్రేషన్లపై దర్యాప్తు చేపట్టాలని, ఆ దిశగా ఎమ్మెల్యేలు, మంత్రులు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

శ్రీకాకుళంలో..

శ్రీకాకుళం నియోజకవర్గంలోని శ్రీకాకుళం, గార మండలాల్లో విలువైన ప్రభుత్వ స్థలాలను వైసీపీ నేతలు కబ్జా చేశారు. గత ప్రభుత్వంలో ఈ నియోజకవర్గానికి చెందిన నేత రెవెన్యూ మంత్రి ఉన్నా సరే శ్రీకాకుళం నగరంలో విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. అక్రమార్కులతో వైసీపీ నాయకులు చేతులు కలిపి శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డులో ఆదివారం పేట వద్ద నాగావళి నదికి ఆనుకుని ఉన్న రూ.కోట్లు విలువైన స్థలానికి సర్వే నంబర్లను మార్పుచేసి ఎంచెక్కా రిజిస్ట్రేషన్‌ను చేయించేశారు. అప్పటి మంత్రి అనుయాయులతో కలసి అప్పటి తహసీల్దార్ భారీ అక్రమాలకు తెరతీశారు. అలాగే వివిధ చెరువులు, గెడ్డలను ఆనుకుని ఉన్న స్థలాలు, భూములను వైసీపీ చోటానాయకులు సొంతం చేసుకున్నారు.



పలాసలో..

పలాసలో వైసీపీ ఆగడాలు మితిమీరాయి. గత మంత్రి ఆధ్వర్యంలో కొండలను పిండి చేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారు. ఏ ఒక్క అధికారి కూడా అడ్డుచెప్పలేకపో యారు. మందస మండలం నల్లబొడ్లూరు కొండ నుంచి 11 ఎకరాల మేర కంకరను తవ్వి అమ్ముకున్నారు. వజ్రపుకొత్తూరు మండలం వెంకటాపురం, బెండి, తాడివాడ కొండల నుంచి అక్రమ తవ్వకాలు చేపట్టి రూ.కోట్లు పోగేసుకున్నారు. పలాస మండలం రామకృష్ణాపురం వద్ద జగనన్న కాలనీ సమీపంలో ఉన్న కొండను కరిగించేశారు. రుషికొండ మాదిరిగా పలాసలోని సూదికొండ, నెమలి కొండను అప్పటి అమాత్యుని అండదండలతో బోడిగుండు కొట్టేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఆ కొండల వైపు వెళ్లేందుకు అక్రమార్కులు ధైర్యం చేయలేకపోతున్నా రు. హమ్మయ్య కొండలు కాస్తయినా మిగిలాయి అంటూ నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. కొండలను ఆనుకుని నిర్మాణాలు, తవ్వకాలు చేపట్టినా గతంలో పట్టించుకున్నవారే కరువయ్యారు. లావేరు, రణస్థలం మండలాల్లో చెరువులు, ప్రభుత్వ భూముల సరిహద్దులు మార్చేశారు. రికార్డులు తారుమారు చేసి ఆక్రమణలకు పాల్పడ్డారు. అప్పటి అధికార పార్టీ నాయకులే ప్రధాన పాత్ర పోషించారు. వైసీపీలో ఓ వర్గానికి చెందిన వారిపై దాడులు చేశారు. ఓ వైసీపీ నాయకుడు శ్రీకాకుళంలో ఓ వ్యాపారిని బెదిరించి ఖాళీ స్టాంపు పేపర్‌పై సంతకాలు చేయించుకున్నాడు. నియోజకవర్గంలో పరిశ్రమలు అధికంగా ఉండడంతో సంబంధిత యాజమానులను వైసీపీ చోటా నాయకులు బెదిరించి సొంత అవసరాలను తీర్చుకునేవారు.

ఆమదాలవలస, నరసన్నపేటలో..

గత ఐదేళ్ల వ్యవధిలో ఆమదాలవలస, నరసన్నపేటకు చెందిన వైసీపీ కీలక నాయకులు కోట్ల రూపాయలకు పడగలెత్తారు. వంశధార, నాగావళి నదుల నుంచి ఇసుకను విశాఖకు తరలించి సొమ్ము చేసుకున్నారు. రకరకాల ఏజెన్సీల పేరుతో తవ్వకాలు చేపట్టి దోచుకున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బహుదా, పాతపట్నం నియోజకవర్గంలో వంశధార నదుల నుంచి వైసీపీ నాయకులే ఇసుక తవ్వకాలు చేపట్టారు.



తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా..

- జలుమూరు, నగిరికటకంలో చోరీలు
- 36 తులాల బంగారు ఆభరణాల అపహరణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

జలుమూరు, జూన్ 26: జలుమూరు మండలంలో దొంగలు రెచ్చిపోయారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు తెగబడ్డారు. రెండుచోట్ల 36 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. దీనిపై బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ● నగిరికటకం గ్రామానికి చెందిన రేజేటి శ్రీనివాసరావు ఇంటిలో 20 తులాల బంగారం చోరీకి గురైనట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. శ్రీనివాసరావు పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కుమారుడి ఆరోగ్యం బాగోలేకపోవడంతో శ్రీనివాసరావు తన కుటుంబంతో కలిసి ఈనెల 21న ఇంటికి తాళాలు వేసుకొని హైదరాబాద్ వెళ్లారు. బుధవారం తిరిగి ఇంటికి చేరుకోగా తాళాలు తీసి ఉండడంతో లోపలికి వెళ్లి చూశారు. బీరువా, కప్‌బోర్డులు తెరచి ఉన్నాయని, అందులోని 20 తులాలు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని క్లూస్ టీంతో పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ● మండల కేంద్రం జలుమూరు మజ్జిలి వీధికి చెందిన కిళారి జగన్నాథరావు ఇంటిలో 16 తులాల బంగారం చోరీకి గురైంది. బాధితుడి వివరాల మేరకు.. మూడు రోజుల కిందట ఇంటికి తాళాలు వేసుకొని జగన్నాథరావు కుటుంబం వైజాగ్ వెళ్లింది. బుధవారం ఇంటికి చేరుకోగా తాళాలు తీసి ఉండడంతో లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువాలో ఉన్న 16 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ఎస్ఐ మధుసూదనరావుకు వివరణ కోరగా.. జలుమూరులో దొంగతనం జరిగినట్లు సమాచారం ఉందని, ఇంకా ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. నగిరికటకం, జలుమూరులో ఒకే తరహాలో తాళాలు వేసివున్న ఇళ్లను లక్ష్యంగా పెట్టుకొని దొంగతనాలు జరగడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



నగిరికటకంలో చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీం, ఎస్ఐ మధుసూదనరావు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎస్పీ

శ్రీకాకుళంక్రైం/శ్రీకాకుళం అర్బన్, జూన్ 26: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ఏడురోడ్ల కూడలిలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానం వరకు రెండు కిలోమీటర్లు సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించి యువతతో పాటు సైక్లింగ్‌లో పాల్గొన్నారు. అలాగే, బాపూజీ కళామందిరంలో విద్యార్థులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలు గురించి పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ అనేక చర్యలు చేపడుతుందన్నారు. పాఠశాలలు, కళాశాల వద్ద తెలియని వ్యక్తులు చాక్లెట్, ఇతర వస్తు రూపంలో ఇచ్చేవాటిని స్వీకరించరాదని సూచించారు. అటువంటి మత్తు పదార్థాల క్రయ, విక్రయాల సమాచారాన్ని డయల్ 100, 112, 14500 నెంబర్లకు గాని పోలీస్ అధికారులకు తెలియజేయాలని కోరారు. మాదక ద్రవ్యాలు రవాణా చేయడంతో పాటు నిల్వ, వినియోగం కూడా ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నేరమన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 4,500, జిల్లాలో 55 (ఎన్‌డీపీఎస్) కేసులు నమోదయ్యాయన్నారు. యువత చదువుకునే వయసులో అలాంటి కేసుల్లో భాగస్వాములైతే ఉద్యోగావకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై తీసిన లఘు చిత్రాలు ఆకట్టుకున్నాయి. 16 లఘు చిత్రాల్లో రోహిత్ బృందానికి మొదటి బహుమతి, రోక్ టీమ్ రమణ బృందానికి రెండో బహుమతి లభించింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు డా.జి ప్రేమ్‌కాజల్, డి.గంగాధరం, జిల్లా యూత్ అధికారి ఉజ్వల్, సీఐలు ఎల్.సన్యాశినాయుడు, ఉమామహేశ్వరరావు, అవతారం, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ రాధిక



వివరాలు వెల్లడిస్తున్న పలాస రైల్వే పోలీసులు

39 కిలోల గంజాయి స్వాధీనం

- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుబడిన ముఠా

పలాస, జూన్ 26: ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న ముఠాను పలాస రైల్వే పోలీసులు బుధవారం మధ్యాహ్నం రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు. రూ.6 లక్షల విలువైన 39 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే సీఐ కె.వెంకటరావు కథనం మేరకు.. మహారాష్ట్ర థానే పట్టణానికి చెందిన జబార్ నజీర్ సయ్యద్, పూణే పట్టణానికి చెందిన శ్యామ్ ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి రైలులో మహారాష్ట్ర వెళ్లడానికి పలాస రైల్వే స్టేషన్‌కు బ్యాగులతో చేరుకున్నారు. ప్లాట్‌ఫారం-2లో వీరిద్దరూ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారి బ్యాగులను రైల్వే పోలీసులు తనిఖీ చేశారు. అందులో గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. అంతలో వారిద్దరూ పరారీ అయ్యేందుకు ప్రయత్నించగా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విశాఖపట్నం రైల్వే కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సీఐ తెలిపారు. గంజాయి పట్టుకున్న పోలీసులను ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్రాన్ని గంజాయి రహితంగా చేయాలని ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించిన రోజునే గంజాయి పట్టుబడడం ప్రాధాన్యత సంతరించుకుంది. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.మధుసూదనరావు, ఎస్‌కె.షరీఫ్, ఏఎస్ఐ కోదండరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యానానికి మంచి రోజులు

- ఉపాధి హామీ పథకానికి అనుసంధానం
- తగ్గనున్న పెట్టుబడులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతాంగం

● మెళియాపుట్టి మండలం చాపర గ్రామానికి చెందిన పోలినాయుడు అనే రైతు తనకు ఉన్న మెట్టు పొలంలో జీడి, మామిడి మొక్కలు పెంచాలని భావించాడు. అయితే, పెట్టుబడులు లేక మొక్కలను పెంచలేకపోయాడు. అయితే కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ నిధులను ఉద్యాన పంటల సేద్యం కోసం కేటాయిస్తామనడంతో పోలినాయుడు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

● మెళియాపుట్టి మండలం జలగలింగుపురం గ్రామానికి చెందిన నడుమింటి శ్రీరాములు అనే రైతు గత ఐదేళ్లు నుంచి తన మెట్టు పొలంలో జీడి, మామిడి మొక్కలు వేయాలని అనుకున్నాడు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేకపోవడంతో మొక్కల పెంపకం నిర్ణయాన్ని విరమించుకున్నారు.



(మెళియాపుట్టి)

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన పంటలకు విస్తరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి నిధులను ఉద్యానానికి అనుసంధానం చేస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తొలి సంతకం చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లుగా బీడుగా ఉన్న భూముల్లో మొక్కలను పెంచి ఆదాయం పొందడానికి అవకాశం దొరుకుందని భావిస్తున్నారు. జిల్లాలో 46,743 ఎకరాల్లో ఉద్యానవన పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో 24,753 ఎకరాల్లో జీడి, 5,315 ఎకరాల్లో మామిడి, 16,675 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలు, కూరగాయలు, ఆయిల్‌పామ్, అరటి తదితర పంటలను సాగు చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. అధికంగా సముద్ర తీర ప్రాంతంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో మెట్టు భూములు అధికంగా ఉన్నాయి. ఈ భూములకు సాగు నీరు అందే పరిస్థితి లేదు. దీంతో పంటలు పండించపోవడంతో బీడుగా మారుతున్నాయి. గత వైసీపీ సర్కారు పూర్తిగా నిధులు కేటాయించకపోవడంతో ఐదేళ్లుగా ఆ శాఖాధికారులు ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేకపోయారు. గత ఐదేళ్లలో మొక్కల పంపిణీ, గిరిజన రైతులతో సమావేశాలు నిర్వహించలేదు. జీడి, మామిడి, ఇతరత్రా అంతర పంటల సాగుపై అవగాహన కూడా కల్పించలేదు. తూతూ మంత్రంగా చిన్న చిన్న కార్యక్రమాలు తప్ప ఆ శాఖ ద్వారా ఏమీ జరగలేదు. దీంతో మొక్కలు పెంచలేని పరిస్థితి ఏర్పడింది.

ఇది లాభం..


జీడి, మామిడి మొక్కలు నాటడానికి 3 అడుగుల లోతున గొయ్యిలు తీయాలి. ఒక గొయ్యి తవ్వకానికి రూ.30 వరకు ఖర్చు అవుతుంది. ఎకరానికి 60 నుంచి 80 మొక్కలు నాటుతారు. వీటిని పెంచేందుకు ఏటా రూ.30 వేల వరకు ఖర్చు జరుగుతుంది. అలాగే, ఇరవై ఏళ్లు పైబడిన తోటలకు కొమ్మలు కత్తిరించడంతో పాటు మల్చింగ్, బోదెలు కట్టడం, నీరు పోయటం వంటి పనులు చేయడానికి రోజుకు ఒకరికి రూ.600 చెల్లిస్తారు. అయితే, ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయడం వల్ల ఈ పెట్టుబడులు రైతులకు తగ్గుతాయి. ఎకరానికి ప్రభుత్వం రూ.2,400 నుంచి రూ.3,200 వరకు ఇస్తుంది. అలాగే, బిందు సేద్యం పరికరాలు కూడా అందిస్తారు. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దిక్సూచి DIKSUCHI

పీజీ, పీహెచ్‌డీ

పెట్రో వర్సిటీ

అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)- ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, ఎక్స్‌టర్నల్, స్పాన్సర్డ్, పార్ట్ టైం విధానాల్లో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. జైస్‌లోని ఆర్‌జీఐపీటీ, బెంగళూరులోని ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్, శివసాగర్‌లోని అస్సాం ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.



ఎంటెక్ విభాగాలు-సీట్లు: జైస్ ఆర్‌జీఐపీటీలో కెమికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగాల్లో ఒక్కోదానిలో 10 సీట్లు ఉన్నాయి. బెంగళూరు ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్‌లో రెన్యూవబుల్ ఎనర్జీ 15, ఎలక్ట్రానిక్ వెహికిల్ టెక్నాలజీ 20 సీట్లు ఉన్నాయి.

పీహెచ్‌డీ విభాగాలు-సీట్లు

- జైస్ ఆర్‌జీఐపీటీలో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయో కెమికల్ ఇంజనీరింగ్ 6, సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్ 7, పెట్రోలియం ఇంజనీరింగ్ అండ్ జియో ఇంజనీరింగ్ 3, మేథమెటికల్ సైన్సెస్ 3, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 2, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 6, మేనేజ్‌మెంట్ స్టడీస్ 2 సీట్లు ఉన్నాయి.
- ఈఐటీ సెంటర్లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాలకు గాను మొత్తం 6 సీట్లు ఉన్నాయి.
- ఏఈఐ సెంటర్లో కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫిజిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజనీరింగ్ విభాగాలకు గాను మొత్తం 9 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
- పీహెచ్‌డీలో ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధిత విభాగంలో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ లేదా కనీసం 65 శాతం మార్కులతో మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. సైన్సెస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా కనీసం 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ ఇన్ సైన్స్ ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. హ్యుమానిటీస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ ఇన్ ఇంజనీరింగ్ లేదా మాస్టర్స్ డిగ్రీ(హ్యుమానిటీస్/సైన్సెస్) లేదా 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/సైన్సెస్)+రెండేళ్ల అనుభవం ఉండాలి. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ (మేనేజ్‌మెంట్) లేదా 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్)+రెండేళ్ల అనుభవం ఉండాలి. అన్ని విభాగాలకు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఎంపిక

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ స్కోర్ లేని అభ్యర్థులు సంస్థ నిర్వహించే రిటెన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఇందులో అర్హత పొందినవారిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు.
- పీహెచ్‌డీలో ప్రవేశానికి కూడా సంస్థ నిర్వహించే రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. నేషనల్ లెవెల్ స్కాలర్‌షిప్‌లు సాధించినవారు, కనీసం 80 శాతానికి మించి అకడమిక్ మార్కులు ఉన్నవారు ఇంటర్వ్యూలకు హాజరైతే చాలు.
- ఎక్స్‌టర్నల్, స్పాన్సర్డ్, పార్ట్ టైం ప్రోగ్రామ్‌లలో చేరేవారు రాత పరీక్ష రాయనవసరం లేదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ. 500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 5
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** జూలై 11, 12
- **అడ్మిషన్స్ పొందిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 16
- **తరగతులు ప్రారంభం:** జూలై 30 నుంచి
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

నలంద యూనివర్సిటీ

బిహార్‌లోని నలంద యూనివర్సిటీ-మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మాస్టర్స్‌లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. విదేశీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్ మాట్లాడని దేశాలకు చెందిన అభ్యర్థులు, ఆంగ్ల మాధ్యమంలో చదవని వారు టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/టీఓఈఐసీ/ పీటీఈ/ ఎస్‌టీఈపీ అర్హత పొంది ఉండాలి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు ప్రోగ్రామ్‌లకు అప్లయ్ చేసుకొనే వీలుంది. మాస్టర్స్ ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి నాలుగేళ్లు. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ఏడాది కోర్సు పూర్తిచేసిన తరవాత డిప్లొమాతో ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది.

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** హిందూ స్టడీస్(సనాతన), వరల్డ్ లిటరేచర్, హిస్టారికల్ స్టడీస్, బుద్ధిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారటివ్ రెలిజియన్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ పీస్ స్టడీస్, ఆర్కియాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్:** సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్:** ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్
- **పీహెచ్‌డీ స్పెషలైజేషన్‌లు:** వరల్డ్ లిటరేచర్, సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్, హిస్టారికల్ స్టడీస్, బుద్ధిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారటివ్ రెలిజియన్స్, హిందూ స్టడీస్(సనాతన)

అర్హత

- మాస్టర్స్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ (హ్యుమానిటీస్/సైన్సెస్/ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్/లా) ఉత్తీర్ణులై ఉండాలి. 250 పదాలకు మించకుండా సెల్ఫ్ ఇంట్రడక్షన్/ బయో నోట్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి. స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ)లో భాగంగా వంద పదాలకు మించకుండా నలంద యూనివర్సిటీలో చదవాలనుకోవడానికి కారణాలు, 300 నుంచి 500 పదాలకు మించకుండా సంబంధిత ప్రోగ్రామ్‌ను ఎంచుకోవడానికి గల కారణాలు వివరిస్తూ ఆర్టికల్ రాయాలి.
- ఎంబీఏ (సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో చేరాలనుకొనేవారు కనీసం 70 శాతం స్కోర్‌తో క్యాట్/ఎక్స్‌ఏటీ/మ్యాట్ అర్హత పొంది ఉండాలి. ప్రభుత్వ సంస్థలు/ప్రముఖ పీఎస్‌యూలలో కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్న వర్కింగ్ ఎగ్జిక్యూటివ్‌లకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ స్కోర్ లేదా డిగ్రీ స్థాయిలో 3/4 జీపీఏ ఉండాలి.
- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కనీసం 65 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ఎంఫిల్ పూర్తిచేసి ఉండాలి. సెల్ఫ్ ఇంట్రడక్షన్, రికమండేషన్/రిఫరెన్స్ లెటర్స్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, రీసెర్చ్ ప్రపోజల్, ఏవైనా రెండు/మూడు పబ్లిష్డ్ లేదా నాన్ పబ్లిష్డ్ పేపర్స్ సబ్మిట్ చేయాలి. పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో చేరాలంటే కనీసం ఎనిమిది నుంచి పదేళ్ల అనుభవం ఉండాలి.

ఎంపిక: ప్రోగ్రామ్‌ను అనుసరించి అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్, ఇంగ్లీష్ సంబంధిత టెస్ట్ స్కోర్‌లు, ఎస్ఓపీ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు ఈమెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 10
- **వెబ్‌సైట్:** nalandauniv.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/laCRootలో చదవండి.

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో జీఎంఈ ట్రైయినింగ్

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఆధ్వర్యంలోని మెరైన్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఈటీఐ)- గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీరింగ్(జీఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఏడాదిపాటు ప్రీ సీ ట్రెయినింగ్ ఉంటుంది. ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఈ ప్రోగ్రామ్‌నకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్) గుర్తింపు ఉంది. స్టయిపెండ్ సౌకర్యం లేదు. మొత్తం 114 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తయిన వెంటనే ఆర్నెల్ల వ్యవధిగల షిప్‌బోర్డ్ ట్రెయినింగ్ పొందాల్సి ఉంటుంది. ఈ శిక్షణ పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు డీజీఎస్ నిర్వహించే ఎంఈఓ క్లాస్- 4 సీఓసీ ఎగ్జామ్ రాసేందుకు అర్హత లభిస్తుంది.



ప్రోగ్రామ్ వివరాలు: ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. డీజీఎస్, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్(ఐఎంఓ) నిబంధనల ప్రకారం క్లాస్ రూం తరగతులు, ల్యాబొరేటరీ వర్క్‌లు, వర్క్‌షాప్ ప్రాక్టీస్‌లతోపాటు సీ ట్రెయినింగ్ ఉంటాయి. అభ్యర్థులందరూ ట్రెయినింగ్ మాన్యువల్, వర్క్ డెయిరీ మెయింటైన్ చేయాల్సి ఉంటుంది. సమయానుసారం రిటెన్ టెస్ట్‌లు, ప్రాక్టికల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. అడ్మిషన్ నాటికి పాస్‌పోర్ట్ పొంది ఉండాలి.


- ప్రోగ్రామ్‌నకు సంబంధించిన స్టడీ మెటీరియల్, టార్ బుక్, ట్రెయినింగ్ మాన్యువల్ అందిస్తారు. భోజన, వసతి సౌకర్యాలకు సంబంధించిన ఖర్చులన్నీ కోర్సు ఫీజులోనే ఉంటాయి. వర్కింగ్ డ్రెస్ కింద ఒక జత సేఫ్టీ షూస్, రెండు జతల బ్లాక్ సాక్స్, ఒక సేఫ్టీ హెల్మెట్ ఇస్తారు. యూనిఫామ్ కింద అయిదు వైట్ షర్ట్‌లు, రెండు బ్లాక్ ప్యాంట్‌లు, ఒక వైట్ ప్యాంట్, వైట్ క్యాప్, ఒక జత ఎపొలెటర్‌లు ఇస్తారు. పీటీ డ్రెస్ కింద రెండు బ్లూ షార్ట్‌లు, రెండు జతల వైట్ టీ షర్ట్‌లు, రెండు జతల వైట్ సాక్స్, ఒక స్విమ్మింగ్ ట్రంక్ ఇస్తారు. పర్సనల్ లాకర్, నాలుగు బెడ్‌షీట్‌లు, ఒక పిల్లో, రెండు పిల్లో కవర్‌లు, రెండు టవల్స్, ఒక మ్యాట్రెస్ కవర్ కూడా ఇస్తారు.
- ఎంపికైన అభ్యర్థులు ఒక జత బ్లాక్ షూస్, ఒక జత వైట్ కాన్వాస్ పీటీ షూస్, రెండు బ్లాక్ ప్యాంట్‌లు, మూడు బాయిలర్ సూట్‌లు(ఆరెంజ్ కలర్ ఫుల్ స్లీవ్స్ కాటన్), రెండు స్లీపింగ్ సూట్స్ (వైట్), ఒక జత స్లిప్పర్స్, షూ బ్రష్, షూ పాలిష్ (బ్లాక్, వైట్), రెయిన్ కోట్, రెండు బాత్ రోబ్స్ వెంట తెచ్చుకోవాలి. ఒక పాకెట్ క్యాలిక్యులేటర్, ఇంజనీరింగ్ డ్రాయింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ కూడా తెచ్చుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి (బీఈ/బీటెక్) (మెకానికల్ ఇంజనీరింగ్/మెకానికల్ అండ్ ఆటోమేషన్/మెకానికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/మెకానికల్ అండ్ ఆటోమొబైల్స్/నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషన్ ఇంజనీరింగ్/ నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్/మెరైన్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. పదోతరగతి/ఇంటర్/ డిప్లొమా/డిగ్రీ స్థాయిలో ఇంగ్లీష్ సబ్జెక్టులో ద్వితీయ శ్రేణి మార్కులు ఉండాలి. డీజీఎస్ నిర్దేశించిన ప్రకారం మెడికల్ ఫిట్‌నెస్ ఉండాలి. అభ్యర్థుల వయసు ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: అకడమిక్ మెరిట్, మెడికల్ ఫిట్‌నెస్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సందర్భానుసారం సైకలాజికల్ స్క్రీనింగ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.4,75,000
- **అడ్మిషన్ ఛార్జెస్:** రూ.10,000
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఈ మెయిల్ ద్వారా పంపాలి. నిర్దేశిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి.
- **హార్డు కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **చిరునామా:** హెచ్ఓడీ, మెరైన్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఈటీఐ), విజ్ఞాన సాగర్, గిరినగర్-682020, ఎర్నాకుళం, కేరళ.
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు 1 నుంచి
- **ఈ-మెయిల్:** metihod@cochinshipyard.in
- **వెబ్‌సైట్:** www.cochinshipyard.in

39 ఏళ్ల తర్వాత ఒకే ఫ్రేమ్‌లో



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే ఎన్నో ఆసక్తికర అంశాలతో భారతీయ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దశాబ్దాల తర్వాత బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ కలయికకు ఈ చిత్రం వేదిక అవ్వడం ఓ విశేషం. 1985లో వచ్చిన 'గిరఫ్తార్' చిత్రంలో అమితాబ్, కమల్ అన్నదమ్ములుగా నటించారు. మళ్లీ ఇన్నాళ్లకు 'కల్కి' చిత్రంతో వీరి కాంబినేషన్ సెట్టయింది. ఇందులో కమల్‌హాసన్ సుప్రీం యాస్కిన్ పాత్రను పోషించగా, అమితాబ్ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. వీరి కలయికతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. వీరిద్దరినీ ఒకే ఫ్రేమ్‌లో చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మించారు.

అభిమానితో నాగ్ సెల్ఫీ



ఇటీవలే ముంబై ఎయిర్‌పోర్ట్‌లో ఓ అభిమాని నాగార్జునను కలిసేందుకు ప్రయత్నించగా, సెక్యూరిటీ సిబ్బంది అతన్ని పక్కకు నెట్టేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విమర్శలు రావడంతో ఆ సంఘటనపై నాగార్జున విచారం వ్యక్తం చేశారు. ఆ అభిమానికి ఎక్స్ వేదికగా క్షమాపణలు చెప్పారు. బుధవారం నాగార్జున ఎయిర్‌పోర్ట్‌లో ఆ అభిమానిని కలిశారు. సెక్యూరిటీ సిబ్బంది పక్కకు నెట్టివేసిన సంఘటన ఆ రోజు తనకు తెలియదని అతనితో చెప్పారు. ఆ అభిమానిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. అతనితో కొంత సమయం గడిపి, ఫొటోలు దిగారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జరిగిన సంఘటన పట్ల మీ ప్రవర్తన హుందాగా ఉంది, 'మీరు రియల్ హీరో సార్' అంటూ నెటిజన్లు నాగార్జునను అభినందిస్తున్నారు.

ఈ తల్లి శాపం తగిలి తీరుతుంది

● ట్రోలర్స్‌పై మండిపడ్డ రేణూదేశాయ్



తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని మీమ్స్‌తో ట్రోల్ చేస్తున్నవారిపై నటుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాజీ భార్య, నటి రేణూదేశాయ్ మండిపడ్డారు. ఏపీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత జనసేనాని పవన్ కల్యాణ్ తన శ్రీమతి అన్నా లెజినోవా, తనయుడు అకిరానందన్, కూతురు ఆద్యలతో దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ ఫొటోను వాడుకొని కొందరు రేణూదేశాయ్ వ్యక్తిత్వాన్ని తక్కువ చేస్తూ రకరకాల మీమ్స్ రూపొందించారు. పవన్ కల్యాణ్‌తో విడాకులు తీసుకోని పొరపాటు చేశారనీ, అదృష్టాన్ని కాలదన్నుకున్నారనీ రకరకాల వ్యాఖ్యలతో మీమ్స్ పెడుతున్నారు. అవి తమను ఎంతగానో బాధపెడుతున్నాయని రేణూదేశాయ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. 'మనుషులు ఇంత దారుణంగా దిగజారడం సిగ్గు చేటు. నాపై వస్తున్న విమర్శలు, నన్నుఎగతాళి చేస్తున్న తీరు చూసి నా కూతురు ఆద్య కన్నీరు పెట్టుకుంది. మీమ్స్ చేసేవాళ్లంతా గుర్తుంచుకోండి, మీకూ ఓ కుటుంబం ఉంటుంది, తల్లులూ, అక్కచెల్లెళ్లు ఉన్నారు. మాపైన జోక్స్ చేస్తున్నవాళ్లకు ఈ తల్లి శాపం తగిలి తీరుతుంది. నా బిడ్డ కార్చిన కన్నీరు, ఊరకే పోదు. ఈ తల్లి శాపం తగిలితీరుతుంది. దీన్ని పోస్ట్ చేసేముందు వంద సార్లు ఆలోచించాల్సి వచ్చింది. కానీ తప్పలేదు' అని రేణూదేశాయ్ తన ఇన్‌స్టా పోస్ట్‌లో పేర్కొన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

అరుదైన గౌరవం



'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంతో ఆస్కార్ వేదికపై తెలుగు సినిమా సత్తా చాటారు దర్శక ధీరుడు రాజమౌళి. అంతే కాదు ఆ సినిమాతో ప్రపంచమంతా తన ప్రతిభకు తగిన గుర్తింపు పొందడంతో పాటు 'నాటు నాటు' పాటకు ఆస్కార్ సాధించారు. తాజాగా ఆస్కార్ అకాడెమీలో చేరేందుకు ఆహ్వానం అందుకొని అరుదైన గౌరవం పొందారు. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పని చేసిన రమా రాజమౌళి కూడా ఈ గౌరవంలో భాగమయ్యారు. ఈ ఏడాది 57 దేశాల నుంచి మొత్తం 487 మంది కొత్త సభ్యులకు ఆస్కార్ అకాడెమీ ఆహ్వానం పంపింది. వీరిలో రాజమౌళి, రమతో పాటు భారతీయ చిత్ర పరిశ్రమ నుంచి షబానా అజ్మీ, రితేశ్ సిధ్వానీ, రవి వర్మన్, రీమా దాస్, ఆనంద్‌కుమార్ టక్కర్ , నిషా పహూజా, హేమల్ త్రివేది, గితేష్ పాండ్యా ఉన్నారు. ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటు నాటు ' పాటకు ఆస్కార్ అవార్డ్ సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం టీమ్‌లో జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, కీరవాణి, చంద్రబోస్, సెంథిల్‌కుమార్, సాబు శిరిల్‌కు ఆస్కార్ అకాడెమీ కొత్త సభ్యులుగా గత ఏడాది ఆహ్వానం అందింది.

యాక్షన్‌ఎంటర్‌టైనర్



అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బడ్డీ'. గాయత్రి భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోన్ దర్శకత్వంలో జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జులై 26న విడుదల కానుంది. మంగళవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ 'నేను కథ కంటే శామ్‌నే ఎక్కువగా నమ్మాను. అల్లు శిరీష్ మా కుటుంబ సభ్యుడు. 'బడ్డీ'లో ఆయన నటన అందరినీ ఆకట్టుకుంటుంది' అని చెప్పారు. 'నేను రాజమౌళిగారి అభిమానిని. ఆయన తీసిన 'ఈగ' చిత్రం ఈ 'బడ్డీ'కి ప్రేరణ. సీజీ వర్క్ చేస్తున్నప్పుడు 'ఈగ' మూవీతో పోల్చి సజెషన్స్ ఇచ్చేవాడిని' అన్నారు దర్శకుడు శామ్. హీరో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'ఇది కొత్త తరహా సినిమా ఇందులో హీరో నేను కాదు.. టెడ్డీ బేర్. ఆ క్యారెక్టర్‌కు ఇంప్రెస్ అయి ఈ సినిమా ఒప్పుకొన్నా. మా నాన్న కూడా నా మీద ఇంత ఖర్చు పెట్టి సినిమా తీయలేదు. భారీ ఖర్చుతో నాతో యాక్షన్ అడ్వెంచర్ తీసిన జ్ఞానవేల్ రాజాగారికి కృతజ్ఞతలు' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/glCv1r4 లో చదవండి.

హామీలను నెరవేర్చిన ఘనత చంద్రబాబుదే: బగ్గు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుదేనని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో దోచుకొని రాష్ట్రాన్ని అప్పులపాల్జేశారన్నారు. అలాంటి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకువెళ్లేందుకు చంద్ర బాబు నాయుడు శ్రమిస్తున్నారన్నారు. డీఎస్సీ, లాండ్ టైట్లింగ్ రద్దు, నైపుణ్య శిక్షణ పెంచేందుకు సిల్క్ సెంటర్లు, పింఛన్ల మొత్తం పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో తాగు, సాగునీరు కల్పించడంతో పాటు పట్టణాభివృద్ధికి అండగా ఉంటానన్నారు. తన విజయానికి కృషి చేసిన కూటమి నేతలు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిమ్మ చంద్ర శేఖర్, వెలమల రాజేంద్రనాయుడు, ఎంవీఅప్పలనాయుడు గొద్దు చిట్టిబాబు, బైరి బాస్కరరావు, కింజరాపు రామారావు, కత్తిరి వెంకటరమణ, బెవర రాము, కరకుల రమేష్, బలగ భారతి, బోయన సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నాలుగు మండలాల ఎంపీడీవోలు, డ్వామా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది ఆయనను కలిసి అభినందించారు. ప్రజలు కోసం నిరంతరం పనిచేయాలని సూచించారు.

మబగాంలో 'బగ్గు'కు ఘన స్వాగతం

పోలాకి: నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి స్వగ్రామం మబగాంలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజులుగా తీర్థయాత్రలకు వెళ్లి బుధవారం తిరిగి వచ్చిన సందర్భంగా మహిళలు కుంకుమ దిద్ది, హారతులిచ్చి స్వాగతం పలికారు. బగ్గు దంపతులకు మహిళలు దిష్టి తీసి ఇంట్లోకి అడుగుపెట్టించారు.

అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా: ఎమ్మెల్యే గోవిందరావు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. స్థానిక కేఎస్ఎం ప్లాజాలో టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎంజీఆర్ విజయోత్సవ సభను బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. వలసల నివారణకు పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని, యువతకు సాంకేతిక విద్య అందుబాటులోకి తెచ్చేందుకు ఐటీఐ లేదా పాలిటెక్నిక్‌లను తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. పాతపట్నంలో 50 పడకల సామాజిక ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ఆయనకు పూలమాలలు, శాలువలు వేసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారుడికి సాయం

ప్రహరాజపాలెం గ్రామానికి చెందిన కిరీటం శీతయ్య ఏపీ సీనియర్ పురుషుల విభాగం నుంచి రగ్బీ జట్టుకు ఎంపికై ఈనెల 29, 30 తేదీల్లో పూనేలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతున్నందున ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు నగదును అందించారు. జాతీయ పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించండి



ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న యువజన సంఘ నేతలు

పలాసరూరల్: బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్లు 66, 67లో 22 ఎకరాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని బొడ్డపాడుకు చెందిన రైతులు ఎమ్మెల్యే శిరీషను కోరారు. ఈ మేరకు బుధవారం వినతిపత్రం అందించారు. వైసీపీ ప్రభుత్వం రావేటీ భూములు 150 ఎకరాలను కొనుగోలు చేసి అక్రమాలకు పాల్పడ్డారని, ఈ విషయంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందన్నారు. టిడ్కో భూములు ఇచ్చిన నిజమైన రైతులకు భూములివ్వకుండా వైసీపీ కార్యకర్తలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి తమకు అన్యాయం చేశారన్నారు. బొడ్డపాడు రోడ్డును మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన సంఘ నాయకులు కిక్కర డిల్లీరావు, రైతులు పాల్గొన్నారు. ● **వజ్రపుకొత్తూరు:** ఎంజేపీబీసీ గురుకుల పాఠశాలల్లో గెస్ట్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని అక్కుపల్లి బీసీ గురుకుల గెస్ట్ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి వినతిపత్రం అందించారు. పాఠశాల ప్రారంభం నుంచి పనిచేస్తున్నామన్నారు. పాఠశాల చైర్మన్ రూప, గెస్ట్ ఉపాధ్యాయులు ఎం.లీల పార్వతి, సునీత, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలి

టెక్కలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి పి.శోభారాణి అన్నారు. బుధవారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రాజెక్ట్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం అందజేయడంతో పాటు చిన్నారులకు ప్రీస్కూల్ విద్యను అమలు చేయాలన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో సెక్టార్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత లేకుంటే చర్యలు

నరసన్నపేట: జాతీయ ఉపాధిహామీ పనుల్లో నాణ్యత లేకుంటే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ సతీష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక డ్వామా కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను తేలికగా తీసుకుంటున్నారని, పనులు జరగకుండా కొలతలు ఎక్కువగా వేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సామాజిక తనిఖీల్లో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీడీ మురళీకృష్ణ, ఏపీవో యుగంధర్ పాల్గొన్నారు.

పాడిపశువులపై అప్రమత్తంగా ఉండాలి

హరిపురం: పాడి పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులు సోకకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని హరిపురం, మందస పశు వైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతి అన్నారు. బుధవారం హరిపురం ఆసుపత్రిలో వారు మాట్లాడుతూ.. తొలకరి వర్షాలు కురుస్తుండడంతో పాడి పశువులకు గొంతువాపు, జబ్బవాపు, చిటుకవ్యాధులు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, వీటి నివారణకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. వ్యాధి సోకిన పశువులకు 24 గంటల్లోగా వైద్యం అందించకపోతే మృతిచెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీనికోసం మండలంలో 1500 డోసుల గొంతువ్యాధి, 1620 డోసుల జబ్బవాపు, 16వేల డోసుల చిటుక వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ టీకాలను ఉచితంగా వేయించుకోవాలని సూచించారు.

డిప్యూటీ సీఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

మందస: నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి సంతోష్ పండా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం మంగళ గిరిలోని జనసేన కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు. కిడ్నీ ఆసుపత్రిలో నెఫ్రాలజిస్ట్‌ను నియమించాలని, జీడిబోర్డు ఏర్పాటు, ఉద్దానంలో ఎలుగుబంట్ల దాడుల నివారణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిశీలించి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు సంతోష్ పండా తెలిపారు.

అంబేడ్కర్ గురుకులం ఆకస్మిక తనిఖీ

పాతపట్నం: స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలను జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెస్, డార్మెటరీ, బాత్‌రూంలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు బోధించిన పాఠాలను మననం చేసుకోవాలన్నారు. భోజన పదార్థాలను పరిశీలించి నిర్వాహకులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, దుప్పలవలస, తామరాపల్లి ప్రిన్సిపాళ్లు బి.బుచ్చిరాజు, ఆర్వీ కృష్ణతార తదితరులు పాల్గొన్నారు.

రాకాశి గెడ్డ వంతెనకు నిధులు మంజూరుపై హర్షం

వజ్రపుకొత్తూరు: మెట్టూరు పంచాయతీ పరిధిలోని రాకాశి గెడ్డపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. బుధవారం మాజీ వైస్ ఎంపీపీ దాసరి జేజేరావు, ఎంపీటీసీ కె.సురేఖ, జోగి తిరుపతిరావు, లైశెట్టి భీమారావు, మాజీ ఎంపీటీసీ భారతి, సాతుపల్లి కామేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ.. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన కొద్దిరోజుల్లోనే గౌతు శిరీష రూ.5.60 కోట్లు నిధులు మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం పూర్తయితే వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు రాకపోకలు మరింత పెరుగుతాయన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ పాలనలో రైతులకు స్వర్ణయుగం

సంతబొమ్మాళి: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడతో రైతులకు స్వర్ణయుగం రానుందని తెలుగుయువత జిల్లా నాయకుడు వజ్జ ప్రభాకర్ అన్నారు. బుధవారం బోరుభద్రలో రైతులకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. రైతు బిడ్డ అచ్చెన్నాయుడు వ్యవసాయశాఖ మంత్రి కావడంతో రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలతో పాటు ఎరు వులు, సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పిని వెంకటేష్, మాజీ ఎంపీటీసీ వల్లభ వసంతరావు పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు రాయితీపై వరి విత్తనాల పంపిణీ

నందిగాం: నరేంద్రపురం పంచాయతీ పాలవలస గ్రామానికి చెందిన ఎస్సీ రైతులకు ఎస్సీ సబ్ ప్లాన్ పథకం కింద రాయితీపై వరి విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ప్రాంతీయ తీర ప్రాంత వరి పరిశోధన సంస్థ నైరా ఆధ్వర్యంలో సర్పంచ్ బి.సన్యాసిరావు ఆధ్వర్యంలో పంపిణీ చేపట్టారు. సీఆర్‌ధన్-412, 414 రకాల వరి విత్తనాలను టీడీపీ నాయకులు పి.అజయ్ కుమార్, పి.చంద్ర శేఖరరావు, ఎం.బాలకృష్ణ రైతులకు అందించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు కిరణ్‌గాంధీ, కోటేశ్వరరావు, శ్యామ్ విత్తనాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్ వర్మ, శివరాంపురం సర్పంచ్ ఎస్.జానకిరాం పాల్గొన్నారు.

300 ఎకరాల్లో మొక్కలు నాటాలి

మెళియాపుట్టి: 300 ఎకరాల్లో మొక్కలు నాటాలని ఉపాధి ఏపీడీ శైలజ తెలిపారు. బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 300 ఎకరాల్లో 8 వేల మొక్కలు నాటాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో పనులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో కేంద్ర, రాష్ట్ర మంత్రులకు పౌరసన్మానం



మాట్లాడుతున్న బగాది శేషగిరి

టెక్కలి: రాష్ట్రంలో, జిల్లాలో కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిందని, ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా నియమితులైన కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడులకు త్వరలో పౌర సన్మానం చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల త్యాగాలు వృథాగా పోవని, వారికి తగిన విధంగా అచ్చెన్నాయుడు గౌరవిస్తారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేసి తీరుతుందని, క్షేత్ర స్థాయిలో ప్రతి అర్హుడికి పథకాలు అందేటట్లు చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, కోళ్ల లవకుమార్, మట్ట పురుషోత్తం, మామిడి రాము, ఇప్పిలి జగదీష్, మెండ దమయంతి, పోలాకి షణ్ముఖరావు, పొన్నాడ రాజారావు, పంగ తవిటయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించండి

సంతబొమ్మాళి: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని డీఎల్పీవో ఐవీరమణ అన్నారు. బుధవారం చినతుంగాం పంచాయతీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతి పంచాయతీలోనూ ఆరోగ్య సర్వే చేపట్టాలన్నారు. అనంతరం చినతుంగాం, కాపుగోదాయవలస, తాళ్లవలస పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమం లో మండల పంచాయతీ విస్తరణాధికారి గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి దుంప శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో జి.గిరిబాల కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైనందున మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో పాటు డయేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికి వెళ్లి వ్యాధులను గుర్తించి వైద్య సేవలు అందించాలన్నారు. సమావేశంలో తురకపేట పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.లక్ష్మీదీప్, ఈవో విమలారావు, ఈవోపీఆర్డీ ఐ.పద్మజ, ఏపీఎం రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు ఆరోగ్యకరంగా ఉండాలి



మాట్లాడుతున్న జడ్పీటీసీ బుచ్చిబాబు

హిరమండలం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, గ్రామాలు ఆరోగ్యకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో డి.స్వరూపరాణి అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశం మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందతో సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ పి.బుచ్చిబాబు మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో తాగునీరు కలుషిత మయ్యే అవకాశం ఉందని జాగ్రత్తలు పాటించాలన్నారు. హిరమండలంలో పలు వీధుల్లో తాగు నీటి పైపులైన్లు మురుగు కాలువలను ఆనించి ఉన్నాయని, పరిశీలించి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగమణి, వైద్యాధికారిసాయిగీత, ఐసీడీఎస్ సీడీపీవో విమలకుమారి పాల్గొన్నారు. ● **నందిగాం:** గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సోక కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో టి.రాజారావు సూచించారు. బుధవారం దేవళభద్ర, నర్సిపురం గ్రామాలను సందర్శించి ఇంటింటి సర్వేని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని తద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం



అవలింగిలో అభిషేకానికి సిద్ధంచేసిన కలశాలు

విశ్వేశ్వరనగర్ (పోలాకి): పోలాకి విశ్వేశ్వర నగర్‌లోని లక్ష్మీగణపతి ఆలయ చతుర్థ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షా సూత్రధారణ, అఖండ దీపారాధన, సిద్ధి బుద్ధి సమేత లక్ష్మీగణపతి విగ్రహాలకు పంచామృతాభిషేకం, గరికపూసలతో సహస్ర నామార్చన, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు తిరువీధి చేపట్టారు. ఆలయ పురోహితులు మావుదూరి లక్ష్మణశాస్త్రి, అర్చకులు జాడ కూర్మారావు శర్మ, ఆలయ ధర్మకర్తలు సురవరపు సంతోష్, యాబాజి రాము పాల్గొన్నారు. ● **జలుమూరు:** అవలింగి గ్రామంలో విజయగణపతి ఆలయ వార్షికోత్సవం బుధవారం ముగిసింది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ప్రత్యేక పూజలతో పాటు 108 కలశాలతో అభిషేకిం చారు. అర్చకుడు జానీ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ● **వజ్రపుకొత్తూరు:** పూండి గోవిందపురంలో వెలసిన హరిహర అయ్యప్పస్వామి దేవాలయ 14వ వార్షికోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి



ఎల్ఎన్‌పేట: మాట్లాడుతున్న జనార్దన్

యంబరాం(ఎల్.ఎన్.పేట): పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సగ్రశిక్ష అభియాన్ ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటర్ జనార్దన్ కోరారు. యంబరాం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలందరిని గ్రామాల్లో గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్ మణికుమార్, కె.చంద్రమౌళి, ఐఈ కో-ఆర్డినేటర్ గోవిందరావు, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ ఉమ, సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

డ్రాపవుట్లను గుర్తించాలి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్లను తగ్గించి స్కూళ్లను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు సూచించారు. బుధవారం హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో విద్యాబోధన జరిగాలన్నారు. బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సంబంధిత యాజమాన్యాలకు వారు సూచించారు.

బడిఈడు పిల్లలను పనిలో పెట్టొద్దు

నందిగాం: బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని, పనిలో ఉండకూడదని ఎంఈవో జి.నర్సింహులు, పలాస కార్మిక అధికారి ఎం.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం బడిబయట పిల్లల గుర్తింపు, బాలకార్మికులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలను సందర్శించారు. బడిఈడు పిల్లల్ని పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనార్దనరావు, ఎ.ప్రసాదరావు, ఏఎస్ఐ వరలక్ష్మి, సీఆర్పీలు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌ను తక్షణం రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

కాశీబుగ్గ: దేశ రక్షణను పణంగా పెట్టే అగ్నిపథ్‌ను వెంటనే రద్దు చేసి పాతపద్ధతిలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరు వాసుదేవరావు, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ రక్షణ వ్యవస్థను సైతం ప్రైవేటీకరణ చేసేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. అగ్నిపథ్‌లో ఎంపికైన వారిని కేవలం నాలుగు సంవత్సరాల మాత్రమే ఉపయోగించుకొని తర్వాత ఇంటికి పంపి ఎటువంటి పెన్షన్, ఇతర సదుపాయాలు లేకుండా చేయడం చూస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి రక్షణపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దేశ రక్షణవ్యవస్థను ప్రైవేటుకు అప్పగించరాదన్నారు. అయితే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్‌ను రద్దు చేస్తూ పార్లమెంట్ సమావేశాల్లో తీర్మానించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో సంఘ నేతలు వెంకటరావు, వల్లభరావు, గుణశేఖర్, సుందరరావు, చందు, సాయి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో ఊరట

శ్రీకాకుళంఅర్బన్/జి.సిగడాం/పాతపట్నం: జిల్లాలో పలు ప్రాంతాల్లో బుధవారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పాతపట్నంలో సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురవగా రోడ్లపై నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలో సాయంత్రం 3.30 గంటల నుంచి సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. అలాగే జి.సిగడాంలో కురిసిన వర్షపు నీరు పొలాల్లో చేరింది. గత కొద్ది రోజులుగా ఎండల తీవ్రతకు అల్లాడిన ప్రజలు ఈ వర్షంతో కొంత ఉపశమనం పొందారు. బుధవారం కురిసిన వర్షం పంటల సాగుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడ్డారు. నగరంలో కురిసిన భారీ వర్షంతో రోడ్లపై నీరు చేరి ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.



శ్రీకాకుళంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



జి.సిగడాం: మర్రివలస వద్ద పొలాల్లో చేరిన నీరు



శ్రీకాకుళంలో కురుస్తున్న వర్షం

నీటి పథకానికి మరమ్మతులు

దీర్ఘాశి(పోలాకి): దీర్ఘాశి కేంద్రంలో ఉన్న వనితమండలం రక్షిత నీటి పథకానికి సిబ్బంది మరమ్మతులు చేపడుతున్నారు. తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో పంచాయతీపై అదనపు భారం పడుతోందని పలువురు పంచాయతీ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. మూడు రోజులుగా కొళాయిల ద్వారా నీరు సరఫరా కావడం లేదని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ మెండ కృష్ణసుమంగళి సూచనల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పైప్ లైన్‌కు మరమ్మతులు చేప ట్టారు. ఇదిలా ఉండగా అక్రమంగా నీటి కనెక్షన్లు ఉన్నాయని ఫిర్యాదులు వచ్చాయని, వీటిపై చర్యలు తీసుకుంటామని సర్పంచ్ స్పష్టం చేశారు.

LOST OF DOCUMENT

I Smt **GORUSU PURNA w/o VENKATI** RESIDENT OF KOLLIPADU VILLAGE, LAKKIVALASA POST SANTABOHMALI MANDAL, SRIKAKULAM, Dist., AP-532211. I HAVE LOST THE SALE DEED DOCUMENT REGN NO 819/17.07.2014 WHILE TRAVELLING FROM MY VILLAGE TO BORUBHADRA BY AN AUTO RICKSHAW ON 13.06.2024. UNABLE TO TRACE SAID THAT DOCUMENT. IN VIDE AFFIDAVIT DATED 20.06.2024 SWORN BEFORE NOTARY AT TEKKALI. CONTACT: 7995955373.

ఒడిశా

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పర్లాకిమిడి: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించి యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఆలీ తదితరులు పాల్గొన్నారు.

జార్ఖండ్ రాష్ట్ర దంపతులకు బాలిక దత్తత

పర్లాకిమిడి: గజపతి జిల్లా శిశు సంరక్షణ కేంద్రంలో ఉంటున్న 14 ఏళ్ల బాలికను కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దంపతులకు దత్తత ఇచ్చారు. ఈ దంపతులు నాలుగేళ్ల కిందట ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. అధికారులు పరిశీలించిన పిమ్మట బాలికను అప్పగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ కేంద్ర అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి, రెవెన్యూ ఏడీఎం బీరేంద్ర కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు

భారీ వర్షంతో రోడ్లు జలమయం



రైల్వే స్టేషన్ టికెట్ కౌంటర్ వద్దకు చేరిన వర్షపు నీరు

పర్లాకిమిడి: ఎండతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు బుధవారం కురిసిన వర్షం ఊరట నిచ్చింది. భారీ వర్షానికి రోడ్లు జలమయ మయ్యాయి. రైల్వేస్టేషన్ టికెట్ కౌంటర్‌లోకి నీరు చేరింది. డ్రైనేజ్ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు రోడ్డుపై నిలిచి పోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కౌలు రైతులను ఆదుకుంటాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెళియాపుట్టి: కౌలు రైతులను ఆదుకుంటామని వ్యవ సాయశాఖ జేడీ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధ వారం ఆంధ్రజ్యోతిలో 'కౌలు కష్టాలు' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈ ఏడాది 7,816 మంది కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. సాగుహక్కు పొందిన రైతులుకు విత్తనాలు, ఎరువులు రాయితీపై ఇస్తామన్నారు. జేపీ సంఘాలు ఏర్పాటు చేసి రుణాలిచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రానున్న వారంలో గ్రామ సభలు నిర్వహించి కొత్త సీసీఆర్ పత్రాలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

నరసన్నపేట: జాతీయ రహదారిపై తరుచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రోడ్డు రవాణాశాఖాధికారి సంజీవరావు అన్నారు. బుధవారం గుండువిల్లిపేట, పోతయ్యవలస జంక్షన్, జమ్ముజంక్షన్, కోమర్తి, దేవాది వద్ద తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ఆర్అండ్‌బీ, పోలీసు, రవాణశాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఏఈ రాజశేఖర్, ఏఎస్ఐ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

పలాస: పలాస రైల్వే స్టేషన్ తాళభద్ర రైల్వేగేటుకు కిలోమీటరు దూరంలో రైల్వేట్రాక్ పక్కన ఉన్న వరద కాలువలో పడి ఓ ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెళ్లి అతడిని అతి కష్టం మీద స్ట్రెక్చర్‌పై తీసుకువెళ్లి ఆసుపత్రిలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్నారు. బుధవారం షాలిమార్- సికింద్రాబాద్ ఫలక్‌నుమా రైలు నుంచి జారిపడి అసోంకు చెందిన ఇంద్ర బహదూర్ బోరో అనే వ్యక్తి కాలువలో పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. రైల్వే సిబ్బంది అతడిని గుర్తించి 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. గేటు వద్ద అంబులెన్స్‌ను పెట్టి కాలిబాటన రైలు ట్రాక్ మీదుగా నడుచుకుంటూ వెళ్లి అతడిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


వరద కాలువలో పడి ఉన్న క్షతగాత్రుణ్ని తరలిస్తున్న 108 సిబ్బంది

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 43 శాతం ఉత్తీర్ణత

గుజరాతీపేట: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు 43 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ నెల 18వ తేదీన విడుదల చేసిన ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి 7,113 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందులో 3047 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో ఉత్తీర్ణత శాతంలో అల్లూరి సీతారామరాజు జిల్లా 67 శాతంతో టాపర్‌గా నిలవగా, శ్రీకాకుళం జిల్లా 12వ స్థానంలో నిలిచింది. అదేవిధంగా ఒకేషనల్‌లో జిల్లా నుంచి 341 మంది హాజరు కాగా 187 మంది ఉత్తీర్ణత సాధించారు. దీనితోపాటు మొదటి సంవత్సరం ఫలితాలు కూడా విడుదల చేశారు. ఇందులో రీ వెరిఫికేషన్‌కు వెళ్లాల్సి ఉన్న విద్యార్థులు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 4వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చునని, రీ వెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్టుకు వెయ్యి రూపాయలు చెల్లించాలని ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించింది.

టెన్త్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 60.32 శాతం..

గుజరాతీపేట: గత నెల 24 నుంచి జూన్ 10వ తేదీ వరకు జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు 60.32 శాతం ఉత్తీర్ణత సాధించారు. శ్రీకాకుళం జిల్లాలో 2218 మంది విద్యార్థులకు గాను 1338 మంది విద్యార్థులు పాసయ్యారు. ఇందులో బాలురు 858 మంది, బాలికలు 480 మంది ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరీక్షల్లో 62.21 మంది ఉత్తీర్ణత శాతం సాధించగా, అందులో బాలురు 59.99 శాతం, బాలికలు 65.96 శాతం సాధించారు. ఇందులో రీ కౌంటింగ్‌కు గాని రీ వెరిఫికేషన్‌కు గాని వెళ్లాల్సిన విద్యార్థులు ఈ నెల 27వ తేదీ నుంచి జూలై 1వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైరక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ వారు పేర్కొంటున్నారు. రీ కౌంటింగ్‌కు సంబంధించి ప్రతి సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు సంబంధించి ప్రతి సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాలి. ఇతర వివరాలకు ఆయా పాఠశాలల్లో సంప్రదించాలన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక కృషి

అరసవిల్లి: మాదక ద్రవ్యాల వినియోగంతో పిల్లల బాల్యం ఛిద్రం అవుతున్న ఘటనలు రాష్ట్రంతో పాటుగా జిల్లాలో కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్నాయని, వీటి నిర్మూలనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్టు ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన మాట్లాడుతూ.. నివారణకు ప్రముఖ వ్యక్తులతో సదస్సులు, అవగాహన కార్యక్రమాలు, సైకియాట్రిస్టులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ అన్ని శాఖల అధికారులను సమాయత్తపరుస్తున్నామని తెలిపారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

శ్రీకాకుళం కల్చరల్: డీసీసీబీ కాలనీలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు బుధవారం చేపట్టిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. అర్చకులు చామర్తి జగన్నాథ ఆచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర నామార్చన, మంగళ శాసనం, కంకణ బంధనం, మండపారాధన, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వైభవంగా భూసమేత వెంకటేశ్వర స్వామికి పూల అలంకరణలో నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు రామ్మోహనరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయాలి

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో పూర్వపు వీసీ హయాంలో చేపట్టిన నియామకాలను రద్దు చేయాలన్న డిమాండ్‌తో వర్సిటీ వద్ద జూలై 1వ తేదీన చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని దళిత జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఎచ్చెర్లలోని ఎస్సీ కాలనీ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. వర్సిటీలో ఎలాంటి నిబంధనలు పాటించకుండా 34 మంది బోధనేతర సిబ్బందిని నియమించారని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయమై ప్రస్తుత వీసీకి వినతిపత్రం ఇచ్చామని, కమిటీల పేరిట కాలయాపన తప్ప చర్యలు చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు టొంపల రమణ, దుర్గాసి గణేష్, తండ్యాన లక్ష్మణరావు, నేతల అప్పారావు, పురుషోత్తం రాంబాబు, బొడ్డేపల్లి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మహానంది జాతీయ పురస్కారానికి ఎంపిక

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన ప్రముఖ శాస్త్రీయ సంగీత కళాకారుడు ఆశి కృష్ణారెడ్డి మహానంది జాతీయ పురస్కారానికి ఎంపికైనట్టు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంత్యుత్సవాలు సందర్భంగా జాతీయ పురస్కారానికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. శాస్త్రీయ సంగీత కళా రంగంలో చేస్తున్న విశిష్టమైన సేవలను గుర్తించి జాతీయ అవార్డుకు ఎంపిక చేసినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రముఖులు చేతులు మీదుగా అదించడం జరుగుతుందని సంస్థ జాతీయ చైర్మన్ రాజ్‌కుమర్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వలబోజు మోహన్‌రావు తెలిపారు. అవార్డుకు ఎంపికైన సందర్భంగా కళాకారునికి సీనియర్ కళాకారులు అభినందించారు.


అవార్డుకు ఎంపికైన కృష్ణారెడ్డి

మొక్కల పెంపకానికి ప్రాధాన్యం

లావేరు: ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు తమ పంట పొలాలు, రోడ్డుకు ఇరువైపుల, చెరువు గట్లు, ప్రభుత్వ రంగ సంస్థల ఆవరణల్లోను ఉద్యానవన, ఫారెస్టు వంటి రకాల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ లోకేష్ అన్నారు. బుధవారం లావేరు ఎంపీడీవోలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో ఆర్.సత్యవతి, జేఈ లెలిన్‌బాబు ఉపాధి సాంకేతిక, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర

కంచిలి: పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర చేపట్టినట్టు మహమ్మద్ రిహాన్‌రాజా తెలిపారు. బిహార్ రాష్ట్రం మధేపురా నుంచి కశ్మీర్ వరకు 11 రాష్ట్రాల మీదుగా 107 రోజులు సైకిల్ యాత్ర చేపట్టినట్టు తెలిపారు. కంచిలి జాతీయ రహదారిపైన ఉన్న మసీదులో బుధవారం విశ్రాంతి తీసుకుని గురువారం కొనసాగిస్తానన్నారు. సైకిల్ యాత్ర ప్రధాన ఉద్దేశం పర్యావరణాన్ని కాపాడుకోవాలనే తన సంకల్పం ప్రజలకు తెలియజేసి చైతన్యం తీసుకువస్తున్నట్టు తెలిపారు. ప్రజల మనోభావాలు, ఆలోచనా విధానాలు తెలుసుకునేందుకు ఈ యాత్ర ఎంతగానో ఉపకరిస్తుందన్నారు.




ఇచ్ఛాపురం: ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు


పలాస: పోలీసులు రూపొందించిన సీడీ నమూనాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష



నరసన్నపేట: ర్యాలీలో పోలీసు, సెబీ అధికారులు

భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా యువత, విద్యార్థులతో కలిసి ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మానవహారాలు చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు.

- ఆంధ్రజ్యోతి బృందం



ఎచ్చెర్ల: ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో ర్యాలీ



శ్రీకాకుళం అర్బన్: రిమ్స్ ప్రాంగణంలో నర్సింగ్ విద్యార్థులు..


టెక్కలి: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజాచక్రవర్తి


పాతపట్నం: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ మహమ్మద్ యాశిన్


ఆమదాలవలస: మాట్లాడుతున్న సీఐ

నియోజకవర్గాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా

● రణస్థలం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

రణస్థలం, జూన్ 26: రాష్ట్రంలో ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి బుధవారం రణస్థలం వచ్చిన సందర్భంగా టీడీపీ నేతలు, బీజేపీ, జనసేన నేతలు పైడిభీమవరం వద్ద ఘన స్వాగతం పలికారు. రామతీర్థం జంక్షన్ వద్ద రామతీర్థం శ్రీరాముని ఆలయం స్వాగతం పలికేలా ఆర్చి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎచ్చెర్ల నియోజకవర్గం కీర్తి, ఖ్యాతిని రాష్ట్రంలో ఇనుమడింప చేస్తానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామిని అమలు చేస్తానన్నారు. తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానన్నారు. నిరుద్యోగ యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ముప్పిడి సరేష్, డీజీఎం ఆనందరావు, పిషిని జగన్నాథంనాయుడు, పైడి అప్పడదొర, పిన్నింటి భానోజీరావు, విశ్వక్సేన్, ఇజ్జాడ శ్రీను, రౌతు శ్రీను, వడ్డాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.


రణస్థలంలో ఎన్ఈఆర్‌కు స్వాగతం పలికిన కూటమి నాయకులు

ఎచ్చెర్ల కూటమి నేతలు..

ఎచ్చెర్ల: శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గానికి తొలిసారిగా విచ్చేసిన నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)కు బుధవారం ఎచ్చెర్ల మండలానికి చెందిన కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. విశాఖ విమానాశ్రయం నుంచి హైవే మీదుగా ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, కూటమి నేతలు వావిలపల్లి రామకృష్ణ, అన్నెపు భువనేశ్వరరావు, పైడి ముఖలింగం, గాలి వెంకటరెడ్డి, గొలివి గోవిందరావు, పొన్నాడ అప్పలనాయుడు, కొత్తకోట అమ్మినాయుడు, గూరు జగపతిబాబు, పైడి అన్నంనాయుడు, మెండ రాజారావు, మూకళ్ల భాస్కరరావు, గట్టెం శివరామ్, గాడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంకిం చంద్ర చటర్జీ జయంతి


నివాళులర్పిస్తున్న గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: వందేమాతరం గేయంతో స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉధ్రూతలూగించిన గొప్ప సాహితీవేత్త ఆ గేయ రచయిత బంకించంద్ర చటర్జీ అని పలువురు వక్తలు కొనియాడారు. గాంధీ మందిరంలో బంకించంద్ర చటర్జీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ నిక్కు అప్పన్న, గాంధీ మందిర ప్రతినిధులు బంకించంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. అవధాని పైడి హరనాథరావు బంకించంద్ర చటర్జీ గొప్పతనాన్ని వివరిస్తూ గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు జామి భీమశంకర్, సురంగి మోహనరావు, బరాటం లక్ష్మణరావు, మెట్ట అనంతం భట్లు, పందిరి అప్పారావు, మహిబుల్లాఖాన్, కొంక్యాన వేణుగోపాల్, నిక్కు హరిసత్యనారాయణ, గుత్తు చిన్నారావు, శాస్త్రి పాల్గొన్నారు.

పింఛన్ల మాయాజాలంపై విచారణ

లావేరు: కొత్తకుంకాం పంచాయతీలో పింఛన్ల మాయాజాలంపై బుధవారం ఎంపీడీవో కొండలరావు విచారణ చేపట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు చేతివాటం చూపించి తప్పుడు ధ్రువపత్రాలతో సుమారు 45 మందికి పింఛన్లు మంజూరు చేయించినట్టు అర్హత ఉండీ పింఛన్ పొందని పెయ్యిల ఆదినారాయణ, డోకి అసిరయ్య, కూనబిల్లి రవిశంకర్, పి.రామారావు తదితర 20 మందితో పాటు టీడీపీ నాయకుడు కె.దామోదరరావు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఎంపీడీవో గ్రామంలో విచారణ చేపట్టారు. అనర్హుల నుంచి రూ.10 వేల నుంచి రూ.15 వేలు వరకు తీసుకుని ఆధార్ కార్డుల్లోని వయసులను మార్పు చేయించి పింఛన్లు మంజూరు చేయించినట్టు ఫిర్యాదుదారులంతా వివరించారు. అనర్హులకు వికలాంగత్వం ఉన్నట్టు ధ్రువపత్రాలు సృష్టించి గత ఐదేళ్లగా పింఛన్ పొందుతున్నవారు ఉన్నట్టు అధికారుల దృష్టికి తెచ్చారు. అలాగే గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వీధి కొళాయిల పైపులు, వాటికి సంబంధించిన వాటర్ ట్యాంక్‌లను ఊడదీసి స్థానిక వైసీపీ నాయకులు తమ ఇళ్లకు తీసుకుపోయారని ఆరోపించారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ.. పింఛన్ల అక్రమాలపై దర్యాప్తు గురువారం కూడా కొనసాగిస్తామని, అనర్హులని రుజువైతే వారి పింఛన్లు తొలగించి చర్యలు తీసుకుంటామన్నారు.

యాంత్రీకరణతో అధిక దిగుబడి

ఆమదాలవలస: యాంత్రీకరణతో అధిక దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్.నీలవేణి అన్నారు. జిల్లాలో ఖరీఫ్ పంట కాలంలో వరి ప్రధానమైన పంట అని, ఈ వరి పంటను సుమారుగా 1,50,000 ఎకరాల్లో సాగుచేస్తున్నారన్నారు. కృష్ణాపురం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనం ఒకేసారి వేసే యంత్రం ప్రదర్శన క్షేత్రాన్ని బుధవారం నిర్వహించి అవగాహన కల్పించారు. సాగు ఖర్చు ఖర్చులు తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. శాస్త్రవేత్తలు ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.అనూష, రెడ్డీస్ ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్ అనంత్ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తాం

అరసవల్లి: ఖరీఫ్ పంటకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సాగునీటి కాలువల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆయన అధికారులను కోరారు. స్థానిక వంశధార ప్రాజెక్టు సర్కిల్ కార్యాలయంలో సాగునీటి సరఫరాపై ఇంజనీరింగ్ అధికారులతో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వంశధార కుడి ప్రధాన కాలువ పరిశీలనలో గుర్తించిన సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తోందని, రైతు సంక్షేమమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. వంశధార ప్రాజెక్టు ఎస్ఈ బి.రాంబాబు మాట్లాడుతూ.. సోమవారం నాటికి ప్రణాళికలు అందజేస్తామన్నారు. నియోజకవర్గంలో వంశధార కుడి కాలువ, బైరి, పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానెల్స్ పరిధిలో 33వేల ఎకరాల భూములకు సాగునీరందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అలాగే ఎనిమిది ఎత్తిపోతల పథకాల్లో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల రాగివైర్లు చోరీకి గురయ్యాయి. వాటిని కూడా బాగు చేయించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్టు తెలిపారు. సోమవారం నాటికి మొత్తం ప్రణాళికలు ఎమ్మెల్యేకు అందజేసి ప్రభుత్వ అనుమతి మేరకు త్వరిత గతిన పూర్తి చేస్తాం.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రధానికి శుభాకాంక్షలు తెలిపిన రామ్మోహన్

అరసవల్లి: న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు టీడీపీ సభ్యులతో బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానిని కలిసిన వారిలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, భరత్ తదితరులు ఉన్నారు. అలాగే రెండోసారి లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యేను కలిసిన అర్చకులు

ఇచ్ఛాపురం: హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను మున్సిపాల్టీ పరిధిలోని వివిధ ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులు మర్యాద పూర్వకంగా కలుసుకుని సత్కరించారు. బుధవారం ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో కలిసి పుష్ప గుచ్ఛం అందించి ఆశీర్వాదం అందించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనువాస్ పండా, కేశవరౌళో, సింహాచలం పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో అర్చకులు

సూపరింటెండెంట్‌గా సుజాత

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ (డీడీవో)గా డాక్టర్ పేడాడ సుజాత బాధ్యతలు చేపట్టారు. ఈ బాధ్యతల నుంచి డాక్టర్ రామదాస్‌ను తప్పించి సుజాతకు అప్పగించారు. ప్రస్తుతం డాక్టర్ సుజాత పొందూరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే గైనకాలజిస్టుగా పనిచేస్తున్నారు.


డాక్టర్ సుజాత

పైనాపిల్ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

ఆమదాలవలస: పైనాపిల్ ఆధారిత ఉత్పత్తులపై గిరిజన యువతకు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో రెండోరోజు బుధవారం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త బి.సునీత శిక్షణ అందించారు. అనంతరం బాటిల్స్ జామ్, ప్యాకింగ్ చేయడం, లేబులింగ్‌ఫుడ్ రిజిస్ట్రేషన్ ఏ విధంగా చేయించాలి తదితర విషయాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వెలుగు అసోసియేషన్ ఏరియా కో-ఆర్డినేటర్ ఆనంద్, వసంత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు అభినందనలు


రవికుమార్‌ను సన్మానిస్తున్న యాదవ సంఘ నాయకులు

ఆమదాలవలస: ఎమ్మెల్యేగా గెలుపొందిన కూన రవికుమార్‌ను జాతీయ యాదవ మహాసంఘ ప్రతినిధులు కలుసుకుని అభినందనలు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో జేవైఎంఎస్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షుడు కడియం అశోకరత్న ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ హయాంలోనే యాదవులకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం దక్కాయన్నారు. దానికి నిదర్శనం ఇటీవలే గాజువాక నుంచి గెలుపొందిన పల్లా శ్రీనివాసరావుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కేటాయించడమేనన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ నాగళ్ల మురళీధర్ యాదవ్, నగేష్ యాదవ్, ఈదు పాపారావు యాదవ్, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో నేల సారవంతం

ఆమదాలవలస: నవధాన్యాలతో నేల సారవంతంగా మారుతుందని ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి సురేష్ అన్నారు. బుధవారం సేపానపేటలో రైతులతో నవధాన్యాల విత్తనాలను పొలాల్లో వేయించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఓన్ ఫీల్డ్ కాంపాక్ట్ బ్లాక్ పరిధిలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నవాన్యాల విత్తనాలను వేయించామన్నారు.

మెగా జాబ్ మేళా రేపు

అరసవల్లి: ఈ నెల 28న స్థానిక డీఎల్‌టీసీ/ప్రభుత్వ ఐటీఐ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో టీవీఎస్ సుందరం ఫైనాన్స్, యొకొహామ, ముత్తూట్ ఫైనాన్స్, ఎన్ఎస్ ఇనుస్ట్రుమెంట్స్, అపోలో ఫార్మసీ, నవతా ట్రాన్సుపోర్టు, బ్లూస్టార్, ఏషియన్ ఆటో పార్ట్స్, పేటీఎం, కికువ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీల్లో ఖాళీగా ఉన్న 481 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు 28వ తేదీ ఉదయం 10.00 గంటలకు తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకుని జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

కంచిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దేవదాస్ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. వివిధ శాఖల పనితీరుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం కొనసాగించాలన్నారు. తహసీల్దార్ ఎంవీకేఎస్ రవి, ఆహ్వానితులు దుర్గాశి ధర్మారావు, మృత్యుంజయం, ఎంఈవో శివరాంప్రసాద్, చిట్టిబాబు, ఏవో ధనుంజయ, పాణిగ్రాహి, హిమసాగర్, మోహన్‌రావు, రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగం అరికట్టాలి

సరుబుజ్జిలి: సమాజంలో డ్రగ్స్, గంజాయి వినియోగం అరికట్టే దిశగా పనిచేయాలని ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఎస్పీ తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు విక్రయించడం, కలిగి ఉండడం కూడా నేరమని, ఈ విషయం ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రం దిశగా మారేందుకు ప్రధానంగా యువతకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఆమదాలవలస సీఐ వాయునందన్, ఎస్ఐ నిహార్, సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలను కాపాడుకుందాం

శ్రీకాకుళం క్రైం: మత్తు పదార్థాల నుంచి భవిష్యత్ తరాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని సెబ్ జడీ డి.గంగాధర్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమ రవాణా జరుగుతున్నట్టు గుర్తించామన్నారు. దీన్ని పూర్తిగా నియంత్రించి యువతను కాపాడుకుందామన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు వారి నడవడికపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మాదక ద్రవ్యాల కయ, విక్రయాలపై ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే 100, 14500 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సెబ్ ఈఎస్ తిరుపతి నాయుడు, ఏఈఎస్ ఎం వినీషా, సీఐ ఎంవి గోపాలకృష్ణడిటిఎఫ్ ఇంటలిజెన్స్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఈ నెల 28న శుక్రవారం రోడ్ క్రాసింగ్ పనులు, ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మతులు చేయడంతో విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ భయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత ఆమదాలవలస, గేట్ ఏరియా, టీఎస్ఆర్ కాలేజీ, పూజారిపేట పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసున్నట్టు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్చరీలో నిహాల్‌కు స్వర్ణం

శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో నగరానికి చెందిన నిహాల్ రామ్‌తేజ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి ఎంపిక పోటీల్లో జిల్లా నుంచి అండర్-10 ఇండియన్ రౌండ్ విభాగంలో ప్రథమస్థానం కైవసం చేసుకుని జాతీయ స్థాయికు ఎంపికయ్యారు. అరసవల్లిలో ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందుతున్న నిహాల్‌తోపాటు 14 మంది పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో చెటికం బద్రి ప్రసాద్, తేజ, బలగ భానుప్రసాద్, జి.గుణశేఖర్, మోక్షజ్ఞ ఆదిత్య, కె.దేవి చరణ్ ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించారు. వీరి ఎంపికపై ఆర్చరీ జిల్లా కార్యదర్శి ఎల్.చిట్టిబాబు, జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రమణ, తదితరులు అభినందించారు.

ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు

ఇచ్ఛాపురం: స్థానిక జేసీఐ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పట్టణంలో గల పలు కార్యాలయాల్లో ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేశారు. బుధవారం భక్తుల కోసం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం వద్ద, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్టు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు షన్ముఖరావు, పవన్‌కుమార్ తెలిపారు. డిల్లేష్, స్వరూప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.